31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

శుక్రవారం, జులై 31, 2026 | పేజీలు : 8

## పోలీసుల చాకచక్యంతో భారీ చోరీ కేసులో నిందితురాలు అరెస్ట్




చురకలు క్రైమ్ ప్రతినిధి, కరీంనగర్, జూలై 30 : కరీంనగర్: కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన భారీ చోరీ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కరీంనగర్ రూరల్ పోలీసులు ఇప్పటికే ప్రధాన నిందితుడైన జడ్పీటీసీ భర్త తగరం శంకర్ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో, గురువారం మధ్యాహ్నం సుమారు 3.30 గంటల సమయంలో, కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి గారికి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు, ఆయన తన సిబ్బందితో కలిసి తీగలగుట్టపల్లి రైల్వే స్టేషన్కు వెళ్లి అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓ మహిళను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో ఆమె తన పేరు ఆడెపు రేష్మా, కేశవ పట్నం మండలం చింతగుట్టపల్లి గ్రామానికి చెందినదని, -మిగతా 2లో

జిల్లాలో మూడు ప్రత్యేక

## రెస్క్యూ బృందాలు సిద్ధం



**జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్**

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 30 :** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు, వర దల నేపథ్యంలో ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు జగిత్యాల జిల్లా పోలీసులు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉన్నారని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. వాగు లు, వంతెనలు, లోతట్టు ప్రాంతాలు, ప్ర ధాన రహదారుల వద్ద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎలాంటి అవాం ఛనీయ సంఘటనలు జరగకుండా ముం దస్తు భద్రతా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ జిల్లా అధికారులతో కలిసి వరద ప్రభా విత ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలిం చి పరిస్థితిని సమీక్షించారు. భారీ వర్షాల కారణంగా ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే స్పందిం చేందుకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వ ర్యంలో ప్రత్యేక శిక్షణ పొందిన మూడు రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ఈ బృందాలకు లైఫ్ జాకెట్లు, తాళ్లు, రెస్క్యూ కిట్లు, ఇతర ప్రత్యేక భద్ర తా పరికరాలు అందుబా టులో ఉంచా మని, వరద ముంపు ప్రాంతాల్లో ప్రజల ను సురక్షిత ప్రాంతా లకు తరలించడం, ప్రమాదంలో చిక్కు కున్న వారిని వెంటనే -మిగతా 2లో

## సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురువాలి

- మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- వేములవాడ భీమేశ్వర స్వామి ఆలయంలో మంత్రుల పూజలు



**చురకలు ప్రతినిధి సిరిసిల్ల జూలై 30 :** సకాలంలో సమృద్ధిగా వర్షాలు కు రువాలని జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కె టింగ్, వ్యవసాయ, చేనేత జౌళి, సహ కార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ, ఎస్టీ, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆకాంక్షించారు. జిల్లా పర్యటన లో భాగంగా వేములవాడ కు చేరుకున్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమా ర్ కు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. మంత్రులకు శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలోకి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, సంజయ్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారికి ఆశీర్వచనం చేసి.. స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఏకాంతంగా నిర్వహించారు. అలాగే శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో జూలై 30వ తేదీ నుండి ఆగస్టు 1వ తేదీ వరకు సత్వర సద్యఃసువృష్టి (సకాల వర్షప్రాప్తి) కోసం ఋశ్యశృంగ ప్రతిష్ఠ, వరుణయాగం, వరుణ పర్జన్య జపానుష్ఠానాలు, హవనాలు, శ్రీ భీమేశ్వర స్వామివారికి సంతత ధారాభిషేకం నిర్వహించను న్నారు. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు యాగశాలలో వరుణయాగాన్ని అధికారికంగా ప్రారంభించారు. భీమేశ్వర సదన్‌లోని ఈశాన్య మూలలో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం భీమేశ్వర సదన్‌లో ఏర్పాటు చేసిన వసతి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా గౌరవ ప్రభుత్వ విప్ మరియు వేములవాడ ఎమ్మెల్యే శ్రీ ఆది శ్రీనివాస్ గారు శాలువాలతో గౌరవ మంత్రులను సత్కరించి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గౌరవ మంత్రులు, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ, వరుణయాగం అనేది కేవలం ఆధ్యాత్మిక క్రతువే కాకుండా లోకకళ్యాణాన్ని ఆకాంక్షిస్తూ నిర్వహించే మహోన్నత వైదిక సంప్రదాయమని పేర్కొన్నారు. సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవడం ద్వారా చెరువులు, కుంటలు, జలాశయాలు నిండిపోతాయని, భూగర్భ జలాలు పెరుగుతాయని, రైతులకు సాగునీరు సమృద్ధిగా లభించి పంటలు బాగా పండుతాయని తెలిపారు. సమృ ద్ధిగా వర్షాలు కురిస్తే రైతులు ఆర్థికంగా బలోపేతం అవడంతో పాటు రాష్ట్రం వ్యవసాయరంగంలో మరింత అభివృద్ధి సాధిస్తుందని, ప్రజలకు తాగునీటి సమస్యలు తీరడంతో -మిగతా 2లో

భారీ వర్షాల నేపథ్యంలో

## అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలి

- ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా సహాయక చర్యలు చేపట్టాలి
- పునరావాస కేంద్రాలను అన్ని మౌలిక వసతులతో సిద్ధంగా ఉంచాలి
- రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ వ్యవస్థలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి
- కలెక్టర్ బి. సత్యప్రసాద్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 30:** జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు ప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. గురువారం తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ జూమ్ సమావేశం నిర్వహించి వర్షాల పరిస్థితి పై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగించా లని, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వేగవంతంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గోదావరి పరీవాహక మండ లాల్లో అధికారులు ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరిం చాలని, గోదావరి నీటిమ ట్టాన్ని ఎప్పటి కప్పుడు పరిశీలిస్తూ -మిగతా 2లో

భారీ వర్షాలతో

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- రెడ్ అలర్ట్ నేపథ్యంలో వచ్చే 24 గంటలు కీలకం
- రాష్ట్ర ఐటి మంత్రి శ్రీధర్‌బాబు



**కమాన్ పూర్ (పెద్దపల్లి) జబ్బార్ ఖాన్ జూలై 30 :** జిల్లాలో గత 48 గంటలుగా కురుస్తున్న భారీ వర్షాలు, మరో 24 గంటల పాటు రెడ్ అలర్ట్ కొనసాగనున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశించారు. గురువారం ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణరావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వర్షాల పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలోని చెరువుల పరిస్థితిని సాగునీటి శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పూర్తి నీటిమట్టానికి చేరుకున్న చెరువులను లస్కర్లు, సహాయ ఇంజినీర్లు, పంచాయతీ కార్యదర్శులు, జీపీవోలు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ గండ్లు లేదా ప్రమాద సూచనలు కనిపిస్తే వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నీట మునిగిన కాజ్‌వేలు, లోతట్టు రహదారులను తక్షణమే మూసివేసి, అక్కడ పోలీసు సిబ్బంది, పంచాయతీ సిబ్బందిని మోహరించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్లకు జరిగిన నష్టాన్ని వెంటనే గుర్తించి తాగునీటి సరఫరా నిలిచిపోకుండా మరమ్మతులు చేపట్టాలని సూచించారు. వర్షాలతో దెబ్బతిన్న ఇళ్లు, పశువుల నష్టాన్ని తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధితులకు త్వరితగతిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ముంపునకు గురైన కుటుంబాలను వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించి ఆహారం, తాగునీరు, వసతి తదితర మౌలిక సదుపాయాలు -మిగతా 2లో

## కల్లూరు-సర్వరాజుపల్లి లెవెల్ బ్రిడ్జిని పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ



**చురకలు ప్రతినిధి కోరుట్ల,జూలై 30 :** జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంలోని కల్లూరు గ్రామం నుంచి సర్వరాజుపల్లి గ్రామానికి వెళ్లే మార్గంలోని లెవెల్ బ్రిడ్జిని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ కలిసి పరిశీలించారు.భారీ వర్షాల నేపథ్యంలో బ్రిడ్జి పరిస్థితిని, రాకపోకలపై ప్రభావాన్ని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన జాగ్రత్త చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీఓ జీవాకర్ రెడ్డి, తహసీల్దార్ కృష్ణ చైతన్య,కోరుట్ల సీఐ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో, మాజీ సర్పంచ్ వన తడుపుల అంజయ్య తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గంజాయి కేసులో కఠిన కారాగార శిక్ష

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 30 :** గంజాయి సరఫరా మరియు అమ్మకానికి పాల్పడిన ఇద్దరు నిందితులకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.10,000 జరిమానా విధిస్తూ జగిత్యాల మొదటి అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి జి. సునీత రవీంద్ర రెడ్డి గురువారం తీర్పు వెలువరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 2024 ఏప్రిల్ 1న పెగడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో అప్పటి ఎస్ఐ జె. రామకృష్ణకు వచ్చిన విశ్వసనీయ సమాచారంతో పెగడపల్లి బస్ స్టాండ్ వద్ద నిఘా ఏర్పాటు చేశారు. సంచులతో అనుమానాస్పదంగా వస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, వారి వద్ద 2.200 కిలోల నిషేధిత గంజాయి లభించిందని తెలిపారు. విచారణలో ఏ1 మెస్రం నగేష్ మరియు ఏ2. పెందూర్ లక్ష్మణ్, ఇద్దరూ అదిలాబాద్ జిల్లా బోథ్ మండలానికి చెందిన వారుగా కాగా, వారి వద్ద నుండి 2 సెల్ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. అప్పటి మల్యాల సర్కిల్ ఇన్స్పెక్టర్ రవి దర్యాప్తు పూర్తి చేసి ఫోరెన్సిక్ నివేదికలు, సాక్ష్యాలతో కూడిన చార్జిషీట్ కోర్టులో దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బిట్ల నర్సయ్య వాదనలు విన్న న్యాయమూర్తి సునీత రవీంద్రరెడ్డి గురువారం నిందితులను దోషులుగా నిర్ధారించి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.10,000 జరిమానా విధించారు. జిల్లాలో గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణా, సరఫరాపై ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. గంజాయి పెంపకం, రవాణా, అమ్మకాలకు పాల్పడితే ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ కేసులో శిక్ష పడేందుకు కృషి చేసిన సీఐ రవి, పీపీ బిట్ల నర్సయ్య, సీఎంఎస్ ఎస్ఐ ఎస్. శ్రీకాంత్, కోర్ట్ కానిస్టేబుల్ హరీష్, సీఎంఎస్ కానిస్టేబుల్ రాజు నాయక్ లను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

## సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురువాలి

**మొదటి పేజీ తరువాయి....**పాటు పర్యావరణ సమతుల్యత కూడా నెలకొంటుందని అన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, తెలంగాణ సస్యశ్యామలంగా వెలుగొందాలని ఆకాంక్షిస్తూ ఈ వరుణయాగాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వాహణాధికారి శ్రీమతి రమాదేవి, అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, మున్సిపల్ చైర్మన్ పుల్లం రాజు, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో మూడు ప్రత్యేక...

**మొదటి పేజీ తరువాయి....** రక్షించడం వంటి చర్యలకు వీటిని విని యోగిస్తామని తెలిపారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లకు వర్షాల నేపథ్యంలో ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. గ్రామాలు, పట్టణాల్లో రెవెన్యూ, మున్సిపల్, అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖలతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సహాయక చర్యలు చేపట్టేందుకు పోలీసు బృందాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. అవసరమైతే పడవలు, ఇతర రక్షణ పరికరాలతో సహాయక చర్యలను మరింత వేగవంతం చేస్తామని వెల్లడించారు. ప్రజలు వాతావరణ హెచ్చరికలను తప్పనిసరిగా గమనించాలని, అధికారులు సూచనలను పాటించాలని, అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని, వాగులు, వంకలు, వరద నీటిని దాటే ప్రయత్నం చేయవద్దని కోరారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తిన వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు.

## భారీ వర్షాల నేపథ్యంలో
# అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలి

**మొదటి పేజీ తరువాయి....** ముంపునకు గురయ్యే గ్రామాలు, కాలనీలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అవసరమైతే ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాలని తెలిపారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు తమ పరిధిలోని పునరావాస కేంద్రాలను తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, ఆహారం, వైద్య సదుపాయాలు తదితర అన్ని మౌలిక వసతులతో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రజలను తరలించాల్సిన పరిస్థితి ఏర్పడితే వారికి భోజనం, తాగునీరు, అవసరమైన సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు పట్టణ ప్రాంతాల్లో డ్రైనేజీలు, నాలాలు ఎక్కడా బ్లాక్ కాకుండా వెంటనే శుభ్రపరచాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. రోడ్లపై చెట్లు విరిగి పడితే వెంటనే తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని, లోతట్టు ప్రాంతాల్లో నీటిముంపు సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లు, దెబ్బతిన్న విద్యుత్ లైన్లను పరిశీలించి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, పాత భవనాలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు డ్రింకింగ్ వాటర్ బృందాలు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లు, యంత్ర సామగ్రిని సిద్ధంగా ఉంచాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో 24 గంటలు పనిచేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది తమ ప్రధాన కార్యాలయాల్లోనే అందుబాటులో ఉండాలని, ముందస్తు అనుమతి లేకుండా ప్రధాన కార్యాలయాలను విడిచి వెళ్లరాదని స్పష్టం చేశారు. ఎక్కడైనా వర్షాల కారణంగా ప్రమాదాలు, నీటి ముంపు, ఆస్తి నష్టం లేదా ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని, తీసుకున్న చర్యలను జిల్లా కంట్రోల్ రూమ్‌కు వెంటనే తెలియజేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు బి.రాజ గౌడ్, అదనపు కలెక్టర్ రెవెన్యూ బి.ఎస్.లత, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల చాకచక్యంతో భారీ చోరీ కేసులో నిందితురాలు అరెస్ట్

**మొదటి పేజీ తరువాయి....**అలాగే ఈ కేసులో మొదటి నిందితుడైన తగరం శంకర్‌కు సన్నిహితురాలినని తెలిపింది. నిన్న తగరం శంకర్‌ను కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన విషయం ఈరోజు పత్రికలు, టీవీ వార్తల ద్వారా తెలుసుకొని, తనను కూడా పోలీసులు అరెస్ట్ చేస్తారనే భయంతో బంధువుల ఇంటికి వెళ్లేందుకు చంద్రాపూర్‌కు వెళ్లే రైలు కోసం తీగలగుట్టపల్లి రైల్వే స్టేషన్‌లో వేచి ఉండగా పోలీసులు పట్టుకున్నారని తెలిపింది.తదుపరి విచారణలో, దొంగతనం జరిగిన రోజున తాను మరియు తగరం శంకర్ కలిసి తీగలగుట్టపల్లిలోని ఫారెస్ట్ అధికారి శ్రీనివాస్ ఇంటిలోకి ప్రవేశించి, ఇంటి తాళాలు పగులగొట్టి, అనంతరం బాత్రూమ్ తాళం కూడా పగులగొట్టి, అక్కడ ప్లాస్టిక్ నీళ్ల ఖాళీ డ్రమ్ములో దాచిపెట్టిన సుమారు రూ.26 లక్షల నగదును అపహరించినట్లు అంగీకరించింది.దొంగిలించిన డబ్బులో తనకు కూడా కొంత వాటా ఇస్తానని తగరం శంకర్ చెప్పినప్పటికీ, అనంతరం అతడు తన స్వగ్రామానికి వెళ్లిపోయాడని, డబ్బు పంపిస్తానని చెప్పి పంపలేదని, తాను ఎదురు చూస్తుండగా అతడిని పోలీసులు అరెస్ట్ చేశారని తెలిపింది.తగరం శంకర్‌తో తాను నిరంతరం మాట్లాడేందుకు ఉపయోగించిన మొబైల్ ఫోన్‌ను కూడా పంచుల సమక్షంలో స్వచ్ఛందంగా చూపించి అప్పగించింది. తన ప్రమేయాన్ని పూర్తిగా అంగీకరించ డంతో, పంచనామా నిర్వహించి, నిందితురాలిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి, అనంతరం రిమాండ్ నిమిత్తం న్యాయస్థానం ఎదుట హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.ఈ కేసులో మిగిలిన అంశాలపై దర్యాప్తు కొనసాగుతున్నదని కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నిరంజన్ రెడ్డి తెలిపారు.

## మైనర్ బాలికలను 12 గంటల్లోనే
# సురక్షితంగా గుర్తించిన పోలీసులు

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ జూలై 30 :** సుల్తానాబాద్ పట్టణంలోని మార్కండేయ కాలనీలో ఉన్న బాలసదన్ చిల్డ్రన్స్ హోమ్ నుంచి 29-07-2026 తేదీన తెల్లవారుజామున ఇద్దరు మైనర్ బాలికలు హాస్టల్ ప్రాంగణంలోని ప్రహరీ గోడ దూకి వెళ్లిపోయిన విషయం తెలియగానే,పెద్దపల్లి డీసీపీ రామ్ రెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు వెంటనే ప్రత్యేక చర్యలు చేపట్టారు.ఈ క్రమంలో నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు.ఒక బృందాన్ని పెద్దపల్లికి,మరో బృందాన్ని కరీంనగర్‌కు,మరో బృందాన్ని స్థానికంగా సమాచార సేకరణ కోసం,ఇంకో బృందాన్ని బాలికల్లో ఒకరి బంధువుల గ్రామమైన పాలితం ప్రాంతానికి పంపించి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు.దర్యాప్తులో భాగంగా సీసీటీవీ దృశ్యాలు, సాంకేతిక ఆధారాలు, ప్రయాణ మార్గాలు మరియు ఇతర సమాచారాన్ని విశ్లేషించగా,బాలికలు సుల్తానాబాద్ చౌరస్తాకు చేరుకుని అక్కడి నుంచి ఆటోలో పెద్దపల్లి రైల్వే స్టేషన్‌కు వెళ్లి,అక్కడి నుంచి రైలులో భువనగిరికి



చేరుకుని, అనంతరం బస్సులో నల్గొండకు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం నల్గొండ బస్టాండ్‌లో ఉన్న ఇద్దరు బాలికలను పోలీసులు తప్పిపోయిన కేవలం 12 గంటల్లోనే సురక్షితంగా గుర్తించి రక్షించారు.అనంతరం వారిని భద్రంగా తీసుకువచ్చి, చట్టపరమైన నిబంధనల ప్రకారం సంబంధిత అధికారులకు అప్పగించారు.ఈ ఆపరేషన్‌లో సుల్తానాబాద్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పొన్నమనేని రంజిత్ రావు,సుల్తానాబాద్ ఎస్‌హెచ్ఓ చంద్రకుమార్,హెడ్ కానిస్టేబుళ్లు మహేందర్, కానిస్టేబుళ్లు వెంకటేష్, రవి,రమేష్,అరుణ్, సదానందం,రేణుకతో పాటు టెక్నికల్ టీమ్ సభ్యులు సమన్వయంతో పనిచేసి బాలికలను వేగంగా గుర్తించి రక్షించడంలో కీలక పాత్ర పోషించారు.ఈ సందర్భంగా డీసీపీ రామ్ రెడ్డి ఆపరేషన్‌లో పాల్గొన్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ పొన్నమనేని రంజిత్ రావు,ఎస్‌హెచ్ఓ చంద్రకుమార్,పోలీసు సిబ్బంది,టెక్నికల్ టీమ్ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. వారి సమన్వయం, అప్రమత్తత,సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించడం వల్లే అతి తక్కువ సమయంలో బాలికలను సురక్షితంగా గుర్తించడం సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు.ఇంత వేగంగా స్పందించి మైనర్ బాలికలను సురక్షితంగా గుర్తించి రక్షించినందుకు సుల్తానాబాద్ మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు,చైల్డ్ వెల్ఫేర్ విభాగం ప్రతినిధులు,స్థానిక ప్రజలు పోలీసు శాఖను అభినందించారు. చిన్నారుల రక్షణ విషయంలో పోలీసులు చూపిన అంకితభావం, అప్రమత్తత, వేగవంతమైన చర్యలు ప్రశంసనీయమని వారు కొనియాడారు.

## భారీ వర్షాలతో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**మొదటి పేజీ తరువాయి...**కల్పించాలని ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న పాత ఇళ్లలో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. గోదావరి పరివాహక ప్రాంతాలు, సరిహద్దు మండలాల్లో ప్రత్యేక నిఘా కొనసాగించాలని, చేపల వేట, నదుల్లోకి వెళ్లడం వంటి ప్రమాదకర చర్యలను నివారించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ఎన్‌పీడీసీఎల్ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని, దెబ్బతిన్న రహదారులను యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు ప్రధాన కార్యాలయాల్లోనే అందుబాటులో ఉండి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, అత్యవసర సంఘటనలు చోటుచేసుకుంటే వెంటనే జిల్లా కంట్రోల్‌రూమ్‌కు సమాచారం అందించాలని మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓ గంగయ్య, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లపై పడిన చెట్లను తొలగించిన పోలీసులు

**-ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా రాకపోకలు పునరుద్ధరణ**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 30 :** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పలుచోట్ల రహదారులపై చెట్లు కూలిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న వెంటనే జగిత్యాల జిల్లా పోలీసులు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని చెట్లను తొలగించి ట్రాఫిక్‌ను యథావిధిగా పునరుద్ధరించారు. బుగ్గారం పోలీస్ స్టేషన్ పరిదిలోని గంగాపూర్ గ్రామంలో రహదారిపై చెట్టు కూలిపోవడంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చెట్టును తొలగించి వాహనాల రాకపోకలకు మార్గాన్ని క్లియర్ చేశారు. పెగడపల్లి-రామడుగు ప్రధాన రహదారిపై భారీ చెట్టు కూలిపోవడంతో బ్లేడ్ ట్రాక్టర్ సహాయంతో చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. అలాగే కొండగట్టు మండలం రాజారం గ్రామ సమీపంలోని హైవే రహదారిపై రెండు చెట్లు కూలిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సంబంధిత శాఖల సిబ్బందితో కలిసి చెట్లను తొలగించి హైవేను పూర్తిగా క్లియర్ చేశారు. భారీ వర్షాల సమయంలో అత్యవసరం అయితే తప్ప ప్రయాణాలు చేయవద్దని, రహదారులపై చెట్లు, విద్యుత్ స్తంభాలు లేదా ఇతర అడ్డంకులు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## కోరుట్ల మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పలు అంశాలకు ఆమోదం



**చురకలు ప్రతినిధి కోరుట్ల, జూలై 30 :** కోరుట్ల పురపాలక సంఘ కార్యాలయం సమావేశ మందిరంలో గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ వసంత తిరుమల అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అజెండాలో పొందుపరిచిన పలు అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అలాగే పట్టణంలోని అన్ని వార్డుల్లో మురికి కాలువలను వెంటనే శుభ్రం చేయాలని, ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యులు అధికారులను కోరారు. దీనిపై స్పందించిన చైర్‌పర్సన్ వసంత తిరుమల, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని వార్డుల్లో మురికి కాలువల శుభ్రత పనులను వేగవంతం చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు,మున్సిపల్ కమిషనర్,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్,మేనేజర్, టీపీఓ,జేఏఓ,ఆర్వో, ఎస్ఐ తో పాటు మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

**-మాజీ మంత్రి జీవన్ రెడ్డి**



**చురకలు విలేకరి, సారంగాపూర్, జూలై 30** : జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని పెంబట్ల కోనాపూర్ గ్రామానికి చెందిన పాస్తం స్వప్న ఇళ్లు వర్షాలకు కూలిపోగా వారి కుటుంబాన్ని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టి.జీవన్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని, ప్రభుత్వం తరుపున నష్టపరిహారం అందించాలని కోరారు. బాధిత కుటుంబానికి ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలను పరిశీలించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులున్నారు.

# వర్షాకాలంలో విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండాలి

**- స్వంతంగా మరమ్మతులు చేసి ప్రమాదాలు తెచ్చుకోవద్దు**

**-ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 1912కు సమాచారం ఇవ్వాలి**

**- ప్రజలు, రైతులకు విద్యుత్ శాఖ అధికారుల హెచ్చరిక**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం, జూలై (30) :** వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో విద్యుత్ సంబంధిత ప్రమాదాల పట్ల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ అధికారులు సూచించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా విద్యుత్ స్తంభాలు దెబ్బతినడం, తీగలు తెగిపడటం, ట్రాన్స్‌ఫార్మర్లలో లోపాలు ఏర్పడటం, ఇళ్లలో షార్ట్ సర్క్యూట్లు సంభవించడం వంటి ఘటనలు పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. వర్షాకాలంలో నేల తడిగా ఉండటం, గోడలు తేమను పీల్చుకోవడం, విద్యుత్ పరికరాల్లో నీరు చేరడం వంటి కారణాల వల్ల విద్యుత్ షాక్‌లు సంభవించే అవకాశాలు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లోపం కారణంగా అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని అధికారులు పేర్కొన్నారు. ప్రజలు తమ ఇళ్లలో విద్యుత్ వ్యవస్థలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ లోపాలను వెంటనే సరిచేయించుకోవాలని సూచించారు. తడి చేతులతో విద్యుత్ స్విచ్‌లు, ప్లగ్‌లు, మోటార్లు, పంపుసెట్లు, ఫ్యాన్లు, కూలర్లు వంటి పరికరాలను తాకకూడదని తెలిపారు. ఇంట్లో పాతబడిన లేదా అతుకులు ఉన్న విద్యుత్ తీగలు ఉంటే వెంటనే మార్చుకోవాలని, నిర్లక్ష్యం చేస్తే షార్ట్ సర్క్యూట్‌తో పాటు అగ్ని ప్రమాదాలు కూడా సంభవించే అవకాశం ఉందన్నారు. ఇంటి బయట ఏర్పాటు చేసిన విద్యుత్ పరికరాలను వర్షపు నీరు తగలకుండా వాటర్‌ప్రూఫ్ కవర్లతో భద్రపరచాలని సూచించారు. ఇళ్లలో ఎర్త్ లీకేజ్ సర్క్యూట్ బ్రేకర్, మినియేచర్ సర్క్యూట్ బ్రేకర్ వంటి భద్రతా పరికరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని అధికారులు సూచించారు. విద్యుత్ లీకేజీ లేదా షార్ట్ సర్క్యూట్ జరిగినప్పుడు ఇవి విద్యుత్ సరఫరాను నిలిపివేసి ప్రమాదాలను నివారించడంలో కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. గ్రామాల్లో సాధారణంగా బట్టలు ఆరబెట్టేందుకు ఉపయోగించే జీఐ వైర్లకు విద్యుత్ తీగలు తగిలే అవకాశం ఉంటుందని, అలాంటి పరిస్థితులు అత్యంత ప్రమాదకరమని పేర్కొన్నారు. విద్యుత్ ప్రవాహం జీఐ వైర్లలోకి చేరి ప్రాణనష్టాలకు కారణమయ్యే ప్రమాదం ఉన్నందున ప్లాస్టిక్ తాళ్లు లేదా ఇతర సురక్షిత ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని సూచించారు. వర్షం పడుతున్న సమయంలో వ్యవసాయ మోటార్లను ఆన్ చేయడానికి రైతులు పొలాలకు వెళ్లకూడదని హెచ్చరించారు. పిడుగులు పడే సమయంలో మోటార్లు, విద్యుత్ పరికరాలు, పంపుసెట్లు, టీవీలు, ఫ్రిజ్‌లు వంటి ఉపకరణాలను ఆఫ్ చేసి ప్లగ్‌లను తొలగించాలని తెలిపారు. వర్షపు సమయంలో పిల్లలు తడి చేతులతో విద్యుత్ పరికరాలను తాకకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. రోడ్లపై, చెరువుల వద్ద, కాలువలలో లేదా నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ తీగలు పడివున్నట్లు కనిపిస్తే వాటికి దగ్గరగా వెళ్లరాదని అధికారులు స్పష్టం చేశారు. అలాంటి తీగలను తాకడం, వాటి పైన వాహనాలను నడపడం లేదా వాటిని తొలగించే ప్రయత్నం చేయడం ప్రమాదకరమని పేర్కొన్నారు. విద్యుత్ స్తంభాలు వంగిపోవడం, స్టే వైర్లు తెగిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి అసాధారణ శబ్దాలు రావడం వంటి పరిస్థితులు కనిపిస్తే వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం అందించాలని సూచించారు. వ్యవసాయ భూముల్లో అడవిపందులు,కోతులు,ఇతర జంతువుల నుంచి పంటలను రక్షించేందుకు విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయడం చట్టరీత్యా నేరమని అధికారులు గుర్తు చేశారు. ఇటువంటి కంచెల వల్ల మనుషులు, పశువులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు రాష్ట్రంలోని పలుప్రాంతాల్లో నమోదయ్యాయని తెలిపారు. రైతులు విద్యుత్ కంచెలకు బదులుగా చట్టబద్ధమైన,సురక్షితమైన పద్ధతులను అనుసరించాలని సూచించారు. ఇటీవల కాలంలో చార్జింగ్‌లో ఉన్న మొబైల్ ఫోన్‌ను ఉపయోగించడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకున్న సంఘటనలు నమోదవుతున్నాయని పేర్కొన్నారు. తడి చేతులతో మొబైల్ ఫోన్ మాట్లాడడం, చార్జింగ్‌లో ఉన్న పరికరాలను వినియోగించడం,తడి నేలపై నిలబడి విద్యుత్ ఉపకరణాలను ఉపయోగించడం వంటి చర్యలను పూర్తిగా నివారించాలని సూచించారు. విద్యుత్ మరమ్మతుల విషయంలో ప్రజలు స్వయంగా చర్యలు చేపట్టడం అత్యంత ప్రమాదకరమని అధికారులు హెచ్చరించారు. ఫ్యూజులు మార్చడం, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పనులు చేయడం, తెగిపోయిన తీగలను సరిచేయడం వంటి పనులు అర్హత కలిగిన ఎలక్ట్రిషియన్లు లేదా విద్యుత్ శాఖ సిబ్బంది మాత్రమే చేయాలని తెలిపారు. స్వంతంగా మరమ్మతులు చేయడం వల్ల ప్రతి సంవత్సరం అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని అధికారులు అభిప్రాయ పడ్డారు. గ్రామపంచాయతీలు, రైతు సంఘాలు, ప్రజాప్రతినిధులు,విద్యుత్ శాఖ సిబ్బంది సమన్వయంతో భద్రతా చర్యలపై ప్రచారం నిర్వహించాలని సూచించారు. ప్రతి గ్రామంలో విద్యుత్ అత్యవసర నంబర్లను ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**1912 టోల్‌ఫ్రీ సేవలను వినియోగించాలి**

విద్యుత్ స్తంభాలు విరిగిపడటం, తీగలు తెగిపడటం, ట్రాన్స్‌ఫార్మర్లలో లోపాలు,విద్యుత్ సరఫరాలో ప్రమాదకర పరిస్థితులు కనిపించిన వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1912కు సమాచారం అందించాలని అధికారులు కోరారు. ప్రజల ఫిర్యాదులపై విద్యుత్ శాఖ అత్యవసర బృందాలు స్పంది స్తాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ నంబర్‌పై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

**1912 కు లేదా సిబ్బందికి సమాచారం ఇవ్వాలి**

**ఇబ్రహీంపట్నం విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్- శ్రీరాముల సతీష్**

వర్షాకాలంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండి విద్యుత్ భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాల ని సూచించారు. ప్రమాదకర పరిస్థితులు కనిపించిన వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం అందించాలి. అవసరం అయితే టోల్ ఫ్రినెంబర్ 1912కు సహాయం కోసం కాల్ చెయ్యాలి.

**వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి**

**మెట్‌పల్లి డివిజన్ ఇంజనీర్ - మధుసూదన్**

విద్యుత్ స్తంభాలు విరిగిపడటం, వైర్లు తెగిపడటం లేదా కిందకు వాలిపోవడం వంటి పరిస్థితులు కనిపించినప్పుడు వాటికి దూరంగా ఉండి వెంటనే శాఖ సిబ్బందికి సమాచారం అందించాలని తెలిపారు. వర్షాకాలంలో చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణనష్టానికి దారితీసే అవకాశం ఉన్నందున ప్రజలు, రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలి.

# కోరుట్లలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**-కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్**

**చురకలు ప్రతినిధి కోరుట్ల, జూలై 30 :** కోరుట్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కళ్యాణలక్ష్మి - షాదీ ముబారక్ పథకం లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోరుట్ల పట్టణానికి చెందిన మొత్తం 114 మంది లబ్ధిదారులకు రూ. 1,14,13,224/- (ఒక కోటి పద్నాలుగు లక్షల పదమూడు వేల రెండు వందల ఇరవై నాలుగు రూపాయలు) విలువైన కళ్యాణలక్ష్మి - షాదీ ముబారక్ పథకం చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కళ్యాణలక్ష్మి -- షాదీ ముబారక్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ



ఈ సంక్షేమ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వానికి, ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్ఐ మొహమ్మద్ అలీముద్దీన్‌కు ఎస్పీ అశోక్ కుమార్ శుభాకాంక్షలు




**చురకలు ప్రతినిధి కోరుట్ల జూలై,30 :** జగిత్యాల జిల్లా కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహించి ఎస్ఐగా పదోన్నతి పొందిన మొహమ్మద్ అలీముద్దీన్ గురువారం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆయనకు ఎస్ఐ హోదాకు సంబంధించిన స్టార్ చిహ్నాలను అలంకరించి పదోన్నతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ పదోన్నతి అనేది కేవలం హోదా పెరగడం మాత్రమే కాకుండా బాధ్యతలు కూడా మరింత పెరుగుతాయని అన్నారు. పెరిగిన బాధ్యతలను క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో నిర్వర్తిస్తూ ప్రజల్లో పోలీసు శాఖపై విశ్వాసం, గౌరవం మరింత పెరిగేలా సేవలు అందించాలని సూచించారు. 1984 బ్యాచ్‌కు చెందిన మొహమ్మద్ అలీముద్దీన్ పోలీసు శాఖలో మచ్చలేని సేవా ప్రస్థానాన్ని కొనసాగిస్తూ ప్రజలకు అంకితభావంతో సేవలందించారని ఎస్పీ కొనియాడారు. ఆయనకు ఎస్ఐ గా పదోన్నతి రావడం పోలీసు శాఖకు ఆయన కుటుంబ సభ్యులకు గర్వకారణమని పేర్కొన్నారు. పదోన్నతి అనంతరం బాధ్యతలు మరింత పెరుగుతాయని వాటిని సమర్థవంతంగా నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షిస్తూ మొహమ్మద్ అలీముద్దీన్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులకు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## జలమయమైన లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్



**చురకలు ప్రతినిధి కోరుట్ల జూలై 30 :** గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా కోరుట్ల పట్టణంలో జనజీవనం అస్తవ్యస్తమైంది. పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమవగా,పలు వార్డుల్లో వర్షపు నీరు ఇండ్లలోకి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్, మున్సిపల్ కమిషనర్ రాఘవేంద్రతో కలిసి పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాలు, ప్రభావిత వార్డులను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసించవద్దని, ఏవైనా అత్యవసర సమస్యలు తలెత్తితే వెంటనే స్థానిక ప్రజాప్రతినిధులు లేదా మున్సిపల్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో 10వ వార్డు కౌన్సిలర్ దాసరి సునీత-రాజశేఖర్, 2వ వార్డు కౌన్సిలర్ హుమేరా కౌసర్-వాసిద్, 21వ వార్డు కౌన్సిలర్ షహనాజ్ సుల్తానా-రిజ్వాన్, 4వ వార్డు నాయకులు శ్రీజ-విజయ్,ఏద్ల జలజ-రమేష్, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఎం.ఎ. నయీమ్, నాయకులు రంగు సత్యనారాయణ, రంజిత్ గుప్తా, ప్రశాంత్, మనోజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# సదర్‌మాట్ బ్యారేజీ వద్ద 6 గేట్లు ఎత్తివేత

**-గోదావరిలో పెరిగిన వరద ప్రవాహం**
**-అప్రమత్తమైన అధికారులు,గోదావరి తీరంవైపు ప్రజలు రావద్దని సూచన**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం, జూలై (30) :** గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న ఎడతెరిపి వర్షాల కారణంగా నదిలో వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో జగిత్యాల జిల్లా - నిర్మల్ జిల్లా మధ్యలో మామడ మండలం పొన్కల్ గ్రామం,ములారాంపూర్ గ్రామల మధ్య గోదావరి నదిపై నిర్మించిన సదర్మాట్ బ్యారేజీ కి గత రెండు రోజులకు కురుస్తున్న వర్షాలతో ఎగువన భారీగా వరద నీరు రావడంతో బ్యారేజ్ కి భారీగా నీరు చేరుతోంది. వరద ప్రవాహం పెరగడంతో సాగునీటి శాఖ అధికారులు అప్రమత్తమై బ్యారేజీలోని 6 గేట్లను గురువారం ఎత్తివేసి దిగువకు నీటిని విడుదల చేశారు.గోదావరి పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల ప్రభావంతో బ్యారేజీకి నీటి రాక రోజురోజుకు పెరుగుతోంది. నీటి మట్టాన్ని నియంత్రించడంతో పాటు బ్యారేజీ భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నారు.సదర్మాట్ బ్యారేజీ నిర్మల్, జగిత్యాల జిల్లాల రైతాంగానికి కీలక సాగునీటి వనరుగా నిలుస్తోంది. వేములకుర్తి గంగనాల ఆయకట్టు ద్వార 5వేల ఎకరాలకు ఇబ్రహింపట్నం మండలం, మల్లపూర్ గ్రామలలోని 7 గ్రామలకు సాగునీరు అందుతుంది.ఇటీవల కురుస్తున్న వర్షాలతో జలాశయంలో నీటి నిల్వలు పెరగడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.అయితే వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నందున దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. నది తీర ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే స్థానిక అధికారులకు సమాచారం అందించాలని అధికారులు కోరారు. భారీగా నీటి ప్రవాహం రావడంతో గోదావరి జలకళ సంతరించుకుంది.

# భారీ వర్షాల్లోనూ ప్రజాసేవలో కోరుట్ల సీఐ. లక్ష్మీనారాయణ

**చురకలు ప్రతినిధి కోరుట్ల,జూలై 30 :** గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న భారీవర్షాల కారణంగా పలుచోట్ల చెట్లు నేలకూలి రహదారుల పై పడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.ఈ నేపథ్యంలో కోరుట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ స్వయంగా రంగంలోకి దిగి జాతీయ రహదారిపై పడిన భారీ వృక్షాన్ని తన సిబ్బందితో కలిసి తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.ఉన్నత పదవిలో ఉన్నప్పటికీ ఎలాంటి హోదా భావం లేకుండా సామాన్య వ్యక్తిలా ప్రజల మధ్య ఉండి సమస్య పరిష్కా రానికి స్వయంగా కృషి చేసిన సీఐ లక్ష్మీనారాయణ సేవలను కోరుట్ల పట్టణ ప్రజల తో పాటు సర్కిల్ పరిధిలోని వివిధ మండలాల ప్రజలు అభినంది స్తున్నారు. భారీవర్షాలు,క్లిష్ట పరిస్థితుల్లోనూ 24 గంటల పాటు ప్రజల భద్రత కోసం అప్రమత్తంగా విధులు నిర్వర్తిస్తూ ఆప ద్బాంధవుడిగా సేవలందిస్తున్న సీఐలక్ష్మీ నారాయణ అంకితభావం అందరికీ ఆదర్శంగా నిలుస్తోందని ప్రజ లు పేర్కొంటున్నారు.ఇలాంటి ప్రజా సేవకు అంకితమైన అధికారి కోరుట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఉండడం ఈ ప్రాంత ప్రజలఅదృష్టమని తమ కృతజ్ఞతలు, అభినందనలు వ్యక్తం చేస్తున్నారు.



# వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను వేగవంతం చేయాలి

**-కలెక్టర్ కోయ శ్రీహర్ష**
**-ఆర్అండ్ఆర్ కాలనీలోకి వరద నీరు చేరకుండా ఆర్ఎఫ్‌సీఎల్ తక్షణ చర్యలు చేపట్టాలి**
**-భారీ వరద ప్రవాహాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలను అప్రమత్తం చేయాలి**
**-రామగుండం వరద ప్రభావిత ప్రాంతాలను ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్‌తో కలిసి పరిశీలించిన జిల్లా కలెక్టర్**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ (పెద్దపల్లి,) జూలై30 :** రామగుండం మున్సిపల్ పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను మరింత వేగవంతం చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.గురువారం రామగుండం మున్సిపల్ పరిధిలోని 21వ డివిజన్ వీర్లపల్లి, ఓ.సి.పి - 3 ఏరియా,25వ డివిజన్ వరద ప్రభావిత ప్రాంతాలను రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్), మున్సిపల్ కమిషనర్ రామగుండం అరుణ శ్రీ తో కలిసి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరద పరిస్థితులను, నీటి నిల్వను, ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ఆర్అండ్ఆర్ కాలనీలో వరదల సమయంలో నీరు ఇళ్లలోకి ప్రవేశించకుండా ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కార చర్యలను రూపొందించాలని ఆదేశించారు.ఓసీ-3 ప్రాంతంలో నిలిచిపోయిన వరద నీటిని యంత్రాల సహాయంతో అత్యంత వేగంగా తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నీటి నిల్వల వల్ల ఎలాంటి ప్రమాదాలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద ప్రవాహాలు వచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా అవగాహన కల్పించాలని, అవసరమైనచోట సహాయక బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు, పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా వంటి మౌలిక సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు, మున్సిపల్ అధికారులు, ఆర్ఎఫ్‌సీఎల్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రుతుపవనాలు, బంగాళాఖాత అల్పపీడనాల వల్ల వర్షాలు

**-తెలంగాణ రైతులు సంతోషం**
**-వాతావరణ అంచనాలు మనం ఆశించిన విధంగా ఏమాత్రం లేవు ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉంటుంది**
**-కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కోండూరి గాంధీ రావు**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూలై 30 :** గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో తెలంగాణ రైతులు సంతోషంగా ఉన్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కోండూరి గాంధీ రావు పేర్కొన్నారు.గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గాంధీ రావు మాట్లాడుతూ ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో మంచి రుతుపవనాలు, బంగాళాఖాత అల్పపీడనాల వల్ల వర్షాలు కురవాలని ఆశిస్తున్నామన్నారు.కానీ వాతావరణ అంచనాలు మనం ఆశించిన విధంగా ఏమాత్రం లేవన్నారు.మనం పరిస్థితిని అర్థం చేసుకుని,ఎల్నీనో ప్రభావం కోసం నిపుణులు ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం వ్యవహరించాలన్నారు, రైతులకు సిఫార్సు చేయబడిన పంటల విత్తనాలు సులభంగా అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ పర్యవేక్షించాలన్నారు. పునరుద్ధరించబడిన వాతావరణ ఆధారిత పంటల భీమా పథకం అనేది భారత ప్రభుత్వ చొరవతో చేపట్టిన ఒక పథకం.ఇది లోటు వర్షపాతం, అధిక వర్షపాతం,తీవ్రమైన ఉష్ణోగ్రతలు తేమ వంటి ప్రతికూల వాతావరణం వల్ల కలిగే ఆర్థిక నష్టాల నుండి రైతులను రక్షిస్తుందన్నారు సాంప్రదాయ దిగుబడి-అంచనాపై ఆధారపడకుండా, ఈ పథకం స్థానిక వాతావరణ-ఆధారిత "ట్రిగ్గర్‌లను"ఉపయోగించి చెల్లింపులను స్వయంచాలకంగా లెక్కించి, పంపిణీ చేస్తుందన్నారు.తెలంగాణ ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.ఖరీఫ్ పంటకాలం లో సాగు చేసే భూమి అంతటికీ భీమా చేయించాలి.ఇందుకోసం అన్ని జూఖుఎంలు,వ్యవసాయ అధికారులు, బ్యాంకర్లు చొరవ తీసుకోవాలి రైతులందరూ పంటల భీమా చేయించుకునేలా చూడాలి.తెలంగాణలో ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో మొత్తం వర్షపాత లోటును పూడ్చడం సాధ్యం కాదు.ఎందుకంటే, తీవ్రమవుతున్న ఎల్ నినో ప్రభావం రుతుపవన కాలం ద్వితీయార్థంలో వర్షపాత గతిశీలతను గణనీయంగా బలహీనపరుస్తుందని అంచనా వేయబడింది.

**లోటు ఎందుకు పూడ్చబడదు**

2026 జూలై చివరి నాటికి, తెలంగాణ ఇప్పటికే 31% నుండి 35% వరకు తీవ్రమైన మొత్తం వర్షపాత లోటుతో పోరాడుతోంది. దానిలోని 33 జిల్లాలలో 30 జిల్లాలు కరువు లాంటి పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి.గత రుతుపవన కాలాల్లో బంగాళాఖాతంలో ఏర్పడే చివరి దశ అల్పపీడన వ్యవస్థలు సాధారణంగా తొలిదశ వర్షపాత లోటును భర్తీ చేసేవి.అయితే, భారత వాతావరణ శాఖ మరియు ప్రపంచ వాతావరణ నమూనాలు ఈ సీజన్‌లో మిగిలిన కాలానికి స్థిరమైన వర్షపాత సరళి భారీగా కుప్పకూలుతుందని సూచిస్తున్నాయి.బలపడుతున్న ఎల్ నినో: రాబోయే వారాల్లో భూమధ్యరేఖ పసిఫిక్‌పై ఎల్‌నినో చక్రం బలపడుతున్న కొద్దీ,అది దక్షిణ ద్వీపకల్పంపై వర్షాన్ని కురిపించే మేఘాలను చురుకుగా అణచివేస్తుంది.

**భారత వాతావరణ శాఖ :-**

ఎడతెరిపి లేకుండా కురిసే వర్షాల పై అడపాదడపా ఉరుములు : భూగర్భ జలాలు,జలాశయాలను పునరుజ్జీవింప జేయడానికి అవసరమైన విస్తృత, నిరంతర భారీ వర్షాలకు బదులుగా, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసే వర్షం స్వల్పకాలిక, తీవ్రమైన, అత్యంత స్థానిక ఉరుముల రూపంలో ఉండే అవకాశం ఉంది. వీటి మధ్యలో వారాల తరబడి పొడి వాతావరణం ఉంటుంది, ఇది రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భారీ వర్షపాత లోటును ఏకరీతిగా పూడ్చడంలో విఫలమవుతుందన్నారు.ఆగస్టు & సెప్టెంబర్ నెలలకు అంచనా వర్షపాత శాతాలు పునరుద్ధరణకు బదులుగా, రాష్ట్రం మరింత పెరిగిన కాలానుగుణ లోటుకు సిద్ధమవుతోంది.రాష్ట్ర వ్యవసాయ అత్యవసర సమీక్షలు మరియు ప్రస్తుత వాతావరణ ధోరణుల ఆధారంగా, మిగిలిన నెలల అంచనాలు కింద వివరంగా ఇవ్వబడ్డాయన్నారు. అంచనా వర్షపాతం & లోటు పరిధి అంచనా సారాంశం & ప్రాంతీయ ప్రభావం ఆగస్టు సాధారణం కంటే తక్కువ నుండి సాధారణం వరకు స్థానికంగా ఉత్తమ అవకాశం మార్పులను తట్టుకోగల ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులను ప్రభుత్వం గట్టిగా కోరుతోందని తాను కూడా రైతంగానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

# సిరిసిల్ల పెద్ద బజార్లో కూలిన భారీ వృక్షం

**-మినీ వ్యాన్ పై కూలడంతో ఒకరికి గాయాలు**





**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూలై 30 :** జిల్లా కేంద్రంలోని పెద్ద బజార్లో ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఓ భారీ వృక్షం నేల కూలింది. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు అయ్యాయి. ఎల్లారెడ్డిపేట మండలం అక్క పెల్లి గ్రామానికి చెందిన అరుకుటి రాజు యాదవ్ అనే వ్యక్తి తన మినీ వ్యాను లో సిరిసిల్లలోని కలెక్టరేట్ కు వెళ్తున్నాడు. స్థానిక గాంధీ చౌరస్తా నుండి పెద్ద బజారు మీదుగా వెళుతున్న సమయంలో హనుమాన్ ఆలయం వద్దకు చేరుకుగానే భారీ వేపచెట్టు ఒకసారిగా నేలకొరిగింది. చెట్టు రాజు వెళ్తున్న వ్యాన్ పై పడడంతో అతడి తలకు గాయాలు అయ్యాయి. వెంటనే అప్రమత్తమైన స్థానికులు రాజును స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానిక కౌన్సిలర్ అటుచెర్ల సాయి కృష్ణ అధికారులకు సమాచారం అందించి రోడ్డుపై కూలిన చెట్టును తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నారూ. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇదే ప్రాంతంలోని హనుమాన్ ఆలయం, విమల్ థియేటర్ సమీపంలో ఉన్న భారీ వృక్షాలను తొలగించాలని అధికారులకు సూచించారు. పెద్ద బజార్ రోడ్డులో నేలకూలిన చెట్లు తొలగించాలని గతంలోని అధికారులు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఎల్జీ "ఓఎల్ఇడి ఏఐ" అత్యాధునిక టీవీలు ఆవిష్కరణ




**చురకలు ప్రతినిధి, హనుమకొండ జూలై 30 :** హోమ్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా తన కొత్త తరం అత్యాధునిక ' ఓఎల్ఇడి ఏఐ' టీవీలను కాజీపేట మార్కెట్‌లోకి గురువారం అధికారికంగా విడుదల చేసింది. కాజీపేట డి-మార్ట్ సమీపంలోని బజాజ్ ఎలక్ట్రానిక్స్ షోరూమ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ వరంగల్ బ్రాంచ్ మేనేజర్ కోల శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై వీటిని ప్రారంభించారు.ఈ సందర్భంగా కోల శ్రీధర్ మాట్లాడుతూ... అత్యాధునిక ఆల్ఫా ఓఎల్ఇడి ఏఐ ప్రాసెసర్, ప్రపంచ స్థాయి ఓఎల్ఇడి డిస్‌ప్లే సాంకేతికతతో రూపొందించిన ఈ టీవీలు వినియోగదారులకు సరికొత్త వీక్షణ అనుభూతిని అందిస్తాయని తెలిపారు. సహజ సిద్ధమైన రంగులు, పర్‌ఫెక్ట్ బ్లాక్ లెవెల్స్, పిక్చర్ క్వాలిటీ వీటి ప్రత్యేకత అని వివరించారు.అలాగే ఈ టీవీల్లో ఏఐ పిక్చర్ ప్రో, ఏఐ సౌండ్ ప్రో, అప్‌డేటెడ్ ఛవమోా స్మార్ట్ ప్లాట్‌ఫామ్‌లతో పాటు గేమింగ్ ప్రియుల కోసం హై-రిఫ్రెష్ రేట్, లో-ల్యాటెన్సీ వంటి పలు ప్రీమియం ఫీచర్లు ఉన్నాయని పేర్కొన్నారు.అందుబాటులో ఉన్న సైజులు C-సిరీస్: 42, 48, 55, 65, 77, 83 అంగుళాలు G-సిరీస్: 55, 65, 77, 83, 97 అంగుళాలు ఉన్నాయి.ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో బజాజ్ ఎలక్ట్రానిక్స్ క్లస్టర్ మేనేజర్ రఘువీర్, స్టోర్ మేనేజర్ స్వామి, సందీప్, ఎల్జీ ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు, వినియోగదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. టీవీ మోడళ్ల ప్రత్యేకతలను సందర్శకులు ఆసక్తిగా తిలకించారు.

## వర్షాలకు కూలిన ఇంటి గోడ



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూలై 30 :** కమాన్‌పూర్ మండల పరిధిలోని పేరపల్లి గ్రామానికి చెందిన నేరెళ్ల సంధ్యారాణి ఇంటి గోడ గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కూలిపోయింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ బొంగోని సదయ్య, జిపిఓ అశోక్, పంచాయతీ సిబ్బందితో కలిసి కూలిపోయిన ఇల్లును పరిశీలించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా తగిన సహాయం అందేలా చూస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొంగోని సదయ్య మాట్లాడుతూ.. వర్షాల దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, శిథిలావస్థకు చేరిన పాత గోడలు, ఇళ్ల వద్ద ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## గురు పౌర్ణమి సందర్భంగా దత్తాత్రేయ స్వామికి ప్రత్యేక పూజలు

**-ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు కటకం మృత్యుంజయం**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట,జూలై 30 :** గురు పౌర్ణమి సందర్భంగా ముందుగా విగ్నేశ్వర స్వామి దత్తాత్రేయ స్వామి, సాయిబాబా,ఆలయంలో మాజీ శాసనసభ్యులు కటకం మృత్యుంజయం తోపాటు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు చేయించి,రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, రైతులకు సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ప్రార్థించారు.అనంతరం ఊరు పురోహితులు రాచర్ల పార్థసారథి రాజు పంతులు గారిచే కటకం మృత్యుంజయంకు వేదాశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,నాయకులు,భక్తులు పాల్గొన్నారు.

## ఎగువ మానేరులోకి పల్వంచ కూడేళ్ళి వాగుల నుండి చేరుతున్న వరద నీరు

**-సంతోషం వ్యక్తం చేస్తున్న ఆయకట్టు రైతులు**





**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూలై 30 :** బంగాళాఖాతంలో ఏర్పడిన తూఫాన్ ప్రభావం వల్ల గత రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు కూడెళ్ళి పల్వాంచ వాగుల ఏగువన కురుస్తున్న వర్షాలకు ఎగువ మానేరులోకి పల్వంచ కూడేళ్ళి వాగుల నుండి వరద నీరు వచ్చి చేరుతుంది.దీంతో ఎగువ మానేరు ఆయకట్టు రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.కూడేళ్ళి పల్వంచ వాగుల నుండి వరద నీరు ప్రవహిస్తుండడంతో దానిని చూడడానికి ఎల్లారెడ్డిపేట గంభీరావుపేట ముస్తాబాద్ మండలాలకు చెందిన ఆయకట్టు రైతులతో పాటుతదితర గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు విద్యార్థులు వర్షాన్ని లెక్కచేయకుండా గొడుగులు పట్టుకుని తరలివెళ్ళి వరద నీటిని చూస్తూ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## బస్టాండును ఆధునికరించాలని మంత్రి పొన్నంకు వినతి



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట జూలై 30 : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు ఆధునికరించాలని,అదేవిధంగా ప్లాట్ ఫామ్ ఎత్తును పెంచి వర్షపు నీరు ఆగకుండా చూడాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కు వినతి పత్రాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వంగ గిరిధర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందించి బస్టాండును ఆధునికరిస్తానని పేర్కొన్నారు.అక్కడ ఏఎంసీ చైర్మన్ షేక్ సభేర బేగం ఉన్నారు.

## నల్మాచు ప్రభాకర్‌కు స్వర్ణ కంకణం బహుకరణ



చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూలై 30 : గత 25 సంవత్సరాలుగా వైశ్య సంఘానికి సేవలందిస్తున్న పెద్దపెల్లి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు నల్మాచు ప్రభాకర్‌ను వైశ్య భవన బిరుదు తో పాటు బంగారు సువర్ణ పథకం బహుకరించారు.మంథని పట్టణానికి చెందిన ప్రభాకర్ సామాజిక సేవా కార్యక్రమాల్లో సైతం చూపుగా పాల్గొంటూ మంచి గుర్తింపు సంపాదించారు. ఇతర వేదికల ద్వారా వైశ్యులకు వైశ్య ధర సామాజిక వర్గాల వారికి చేస్తున్న సేవలకు గుర్తింపుగా హైదరాబాద్ కు చెందిన లలిత కళా సమాఖ్య (సామాజిక సాంస్కృతిక సేవా సంస్థ) వారిచే అత్యున్నతమైన వైశ్య వైభవ రత్న(బిరుదు) అవార్డుతో పాటు సువర్ణ కంకణం బంగారు పథకంతో సత్కరించారు. ప్రభాకర్ ఈ అవార్డు కు ఎంపికైన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు పొన్నూరు మాజీ ఎంపీటీసీ ముత్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాజీ జెడ్పిటిసి గండ్ర వెంకటరమణ రెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రయ్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బుచ్చన్న, యూత్ కాంగ్రెస్ నాయకులు రావిగంటి సతీష్, ప్రభాకర్ కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

## భారీ వర్షంలో సైతం...



చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూలై 30 : భారీ వర్షాన్ని సైతం లెక్కపెట్టకుండా ఎన్పీడీసీఎల్ సిబ్బంది డిటిఆర్ ను బిగించడం జరిగింది. కమాన్ పూర్ మండలం గుండారం గ్రామం రోడ్డు ప్రక్కన గల ఇమామ్ గిర్ని వద్ద గల ట్రాన్స్ఫార్మర్ బుధవారం కాలిపోయింది. దీంతో గురువారం రోజున వర్షాన్ని సైతం లెక్కపెట్టకుండా ఆయా ట్రాన్స్ఫార్మర్‌ను బిగించి విద్యుత్ను పునరుద్ధరిం చారు.ఈ కార్యక్రమంలో లైన్మెన్ కలవేన ఓదెలు,ఏఎల్ఎం మహంకాళి శ్రీనివాస్,అన్‌మెన్ బొమ్మెన సునీల్,పాల్గొన్నారు.

## టోపీలు రైన్ కోట్లు అందజేత

చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూలై 30 : కమాన్‌పూర్ మండలం గుండారం గ్రామపంచాయతీ సఫాయి కార్మికులకు టోపీలు,మరియు రైన్ కోట్ల లను రాజరాజేశ్వర కిరాణం జనరల్ స్టోర్ యజమాని నిమ్మతి రమేష్ అందజేయడం జరిగింది.రమేష్ తండ్రి యగు స్వర్గీయ నిమ్మతి భీమయ్య స్మారకార్థం ఈ టోపీలను మరియు రెయిన్ కోట్లను అందజేయడం జరిగింది. గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురియడంతో నిమ్మతి రమేష్ సఫాయి కార్మికులు వర్షంలో పనిచేస్తుండడంతో స్పందించి రేణు కోట్లతో పాటు టోపీలను అవునూరి శంకర్,అవునూరి ఆనందం,ఇరుగు రాళ్ల నరేష్, ఇరువురాళ్ల వంశీ, దామెర శంకర్,పులిపాక స్వరూపలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వడ్లకొండ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి ప్రజల చిరకాల కల బస్సు డిపో...

**-దసరా వరకు ఆర్టీసీ బస్సు డిపో నిర్మాణ పనులు పూర్తి**

**-నూతన బస్సు డిపోతో పెరగనున్న రవాణా సౌకర్యాలు**

**-ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు**



చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (పెద్దపల్లి జిల్లా) జూలై 30 : పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఆర్టీసీ బస్సు డిపో నిర్మాణ పనులను ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తో కలిసి ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మాణం చేస్తున్న బస్సు డిపో పనులను తెలంగాణ ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తో కలిసి పరిశీలించడం జరిగింది అని దసరా వరకు పెద్దపల్లి బస్సు డిపో ప్రారంభించే దిశగా పనులు త్వరత్వరగా జరిగేల ఎం.డి అధికారులకు మరియు కాంట్రాక్టర్ కు తెలిపారని అన్నారు. బస్సు డిపో పెద్దపల్లి నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష అని ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మూడు రెవెన్యూ డివిజన్లల్లో బస్సు డిపో ఉన్నప్పటికీ మొదటి నుండి పెద్దపల్లి కూడా రెవెన్యూ డివిజన్ అయినప్పటికీ కూడా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో గత ప్రభుత్వ హయాంలో డిపో లేకపోవడం సిగ్గు చేటని ఆగ్రహం వ్యక్తం చేశారు.తాను శాసనసభ్యులుగా ఎన్నికైన తర్వాత గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి పెద్దపల్లి ప్రజల ఆకాంక్ష అయిన బస్సు డిపో మంజూరు చేయమని వినతి పత్రం అందజేసిన తర్వాత వారు పెద్దపల్లి ప్రజలపై ఉన్న మమకారంతో వారు 2024 డిసెంబర్ మాసంలో పెద్దపల్లి ప్రాంతానికి విచ్చేసి యువ వికాసం బహిరంగ సభలో బస్సు డిపో మంజూరు చేయడం జరిగిందని అన్నారు. పెద్దపల్లి బస్సు డిపోను దసరా వరకు పూర్తి చేస్తామని ఆర్టీసీ ఎండీ తెలిపారని ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు తెలిపారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, ఆర్టీసీ అధికారులు, పట్టణ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచులు, సింగిల్ విండో చైర్మన్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రచయిత డా.పరశురాంకు జాతీయ గుర్తింపు

**-ఢిల్లీ ఆంధ్రభవన్‌లో జాతీయ వాగ్దేవి విశేష ప్రతిభా పురస్కారం ప్రదానం**

చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డి పేట జూలై 30 : రాజన్న సిరిసిల్ల జిల్లా, ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉపన్యాసకులు సింగారం గ్రామవాసి రచయిత, బాల సాహితీవేత్త డా.వాసరవేణి పర్శరాములుకు తెలుగు భాష, బాలసాహిత్యానికి చేస్తున్న కృషికి గాను జాతీయ స్థాయి గౌరవం దక్కింది.జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జూలై 29న ఢిల్లీలోనిలి ఆంధ్రభవన్‌లో నిర్వహించిన ' తెలుగు వెలుగు సంబరాలు-2026 'బిసి.నారాయణరెడ్డి జయంతివేడుకలు కార్యక్రమంలో ఆయనకు ప్రత్యేక ఆహ్వానంతో పాటు బి'జాతీయ వాగ్దేవి విశేష ప్రతిభా పురస్కారం' అందజేశారు . ఈ కార్యక్రమంలో కేంద్ర ఉక్కు గనుల మరియు భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ , పార్లమెంటు సభ్యులు ,బంగారు లక్ష్మణ్, బీద మస్తాన్ రావు, మాగుంట శ్రీనివాసులురెడ్డిలు,ఆచంట శాసన సభ్యులు పితాని సత్యనారాయణ, తిరుమల తిరుపతి దేవస్థానం ప్రవచన కర్త ఆకెళ్ల విభీషణ శర్మ, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి, ఉస్మానియా యూనివర్సిటీ తెలుగుశాఖ పూర్వ అధ్యక్షులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, ప్రొఫెసర్ జగదీశ్వర్,ఢిల్లీ యూనివర్సిటీ ఆచార్యులు అట్టెం దత్తయ్య, తెలంగాణ మాజీ బిసి కమీషనర్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్ ,జాతీయ సారస్వత పరిషత్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేశిరాజు రాంప్రసాద్ అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్, డా .ఎస్.ఆదినారాయణ, తెలుగు భాష చైతన్య సమితి అధ్యక్షుడు బదేసాభ్ ,ఉద్దండరాజు, చాన్సిలర్ చైతన్య రాజు, సినీ నిర్మాత తుమ్మల పల్లి రామసత్యనారాయణ, ప్రభాకర్ రెడ్డి ,చెరుకు మహేశ్వర శర్మ,కామని లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



# కొమ్మెరకు పితృవియోగం

చురకలు విలేఖరి,తిమ్మాపూర్ జులై 30 : కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, కొమ్మెర ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్మెర రవీందర్ రెడ్డి తండ్రి కొమ్మెర ధర్మారెడ్డి గురువారం పరమపదించారు.ధర్మారెడ్డి అంత్యక్రియలకు అశేష జనవాహిని తరలివచ్చింది. కురుస్తున్న భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా బంధుమిత్రులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు.ధర్మారెడ్డి మృతిచెందిన విషయం తెలుసుకున్న మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తన ముందస్తు పర్యటన కార్యక్రమాలను కుదించుకుని మాదాపూర్ గ్రామానికి చేరుకుని ధర్మారెడ్డి పార్థివ దేహానికి అంతిమ నివాళులర్పించారు.



అనంతరం,ఆయన కుమారుడు కొమ్మెర రవీందర్ రెడ్డిని, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యం కలగాలని ఆకాంక్షించారు.ఈ అంతిమయాత్రలో గన్నేరువరం, మానకొండూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొడ్డు సునీల్, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముస్కు ఉపేందర్ రెడ్డి,నాయకులు అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, అలువాల కోటి, మాతంగి అనిల్, ముక్కస రత్నాకర్ రెడ్డి, రేమిడి శ్రీనివాస్ రెడ్డి,తాళ్ళపల్లి సంపత్ గౌడ్, రామిడి తిరుమల్ రెడ్డి,బండి మల్లేశం,సిహెచ్ శ్రీధర్,అనంత్ రెడ్డి, ఎం.శ్రీనివాస్, సిహెచ్ నరసింహ రెడ్డి,మల్లేశం,సంపత్ రెడ్డి,దేవయ్య,అంజిరెడ్డి,బుర్ర శ్రీకాంత్ గౌడ్,రెవెల్లి రాజలింగం, ఎనగంటి శ్రీకాంత్,నల్ల సూర్య ప్రకాష్, ఎ.శ్రీకాంత్ తోపాటు పార్టీ జిల్లా, మండల, రాష్ట్ర నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, సింగిల్ విండో అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్మారెడ్డికి ఘనంగా తుది వీడ్కోలు పలికారు.

# శిథిలావస్థలో ఉన్న ఇండ్లపై నిఘా ఉంచాలి

**-నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలి**
**-మెట్‌పల్లి తహసీల్దార్ నీతా**



**చురకలు విలేకరి,మెట్‌పల్లి రూరల్, జూలై 30 :** ఎడతెరిపి లేకుండా రెండు రోజుల నుంచి భారీ వర్షాల కురుస్తున్న నేపథ్యంలో మండలంలోని వరద కాలువ,పెద్దవాగు ప్రవహించే ప్రాంతాలను తహసీల్దార్ నీతా అధికారులతో కలసి సందర్శించారు.ఈ మేరకు వెల్లుల, ఆత్మకూర్,ఆత్మనగర్, జగ్గసాగర్ ఆయా గ్రామాల్లో అధికారులు సందర్శించి భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లోతట్టు ప్రాంతాలోకి వెళ్లకుండా గ్రామాధికారులు ఏప్పటికపుడు చర్యలు చెప్పటలని తహసీల్దార్ నీతా సూచించారు.వెల్లుల గ్రామంలోని అధిక వర్షాల కారణంగా వెల్లుల్ల గ్రామంలోని శిథిలావస్థలో ఉన్న ఇండ్లని గ్రామాధికారులతో కలిసి పూర్తిగా దెబ్బతిన్న నాలుగు ఇండ్లల్లో నివసిస్తున్న వారిని వెంటనే ఇంటి నుంచి ఖాళీ చేయించి ప్రభుత్వ పాఠశాలలోకు తరలించి వసతి సౌకర్యం కల్పించి అవసరమయ్యే నిత్యవసరాలను గ్రామ పంచాయతీ అధికారులు ఏర్పాట్లు చేశారు.అలాగే ఆత్మకూర్ పెద్దవాగు, పెద్దచెరువు మత్తడి ప్రస్తుత పరిస్థితిని రెవిన్యూ అధికారులు తహసీల్దార్ నీతా కలిసి పరిశీలించి ఏప్పటికపుడు అప్రమత్తం ఉండాలని గ్రామపాలనధికారులకు తెలియజేశారు.అనంతరం శిథిలావస్థలో ఉన్న ఇండ్లను తహసీల్దార్ నీతా సందర్శించి వారికీ భారీ వర్షాల కారణంగా వసతి సౌకర్యం కల్పించాలని అత్యవసరం అయితే తప్ప ఎలాంటి పరిస్థితి లో బయటకు రావదాని ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమం లో సర్పంచ్ గూడూరు తిరుపతి, సర్పంచ్ చిట్యాల రాజారాం, ఉపసర్పచ్ కసడి తిరుపతి,శేఖర్,జీపిఓ నాగరాణి, కార్యదర్శి నారాయణ, మహేష్ వార్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

# పెద్ది సుదర్శన్ త్వరగా కోలుకోవాలి

**-కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు**



**చురకలు విలేకరి, మల్యాల, జూలై 30 :** మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని మళ్లీ ప్రజల మధ్యకు రావాలని ఆకాంక్షిస్తూ గురువారం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు సుంకే రవిశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ ఆంజనేయస్వామి వారి ఆశీస్సులతో పెద్ది సుదర్శన్ త్వరగా ఆరోగ్యవంతుడై యథావిధిగా ప్రజాసేవలో కొనసాగాలని ప్రత్యేకంగా ప్రార్థించినట్లు ఆయన పేర్కొన్నారు. సుదర్శన్ త్వరగా కోలుకుని ప్రజల ఆశయాలను నెరవేర్చే సేవా కార్యక్రమాలను మరింత ఉత్సాహంగా కొనసాగించాలని ఆకాంక్షించారు.

# రెండో రోజు ఎడతెరిపి లేని వర్షం

**-భారీ వర్షాలతో అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం**
**-పాఠశాలలకు సెలవు**
**-పలు చోట్ల నీట మునిగిన లో లెవల్ వంతెనలు**



**చురకలు ప్రతినిధి,జగిత్యాల, జూలై 30 :** జగిత్యాల జిల్లాలో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురు వర్షాలకు జనజీవనం పూర్తిగా స్తంభించింది. రోడ్లపై నీరు నిలవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పరిస్థితిని సమీక్షించిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ విద్యార్థుల భద్రత దృష్ట్యా జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వర్షాల కారణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే సహాయక చర్యల కోసం సిద్ధంగా ఉండాలని తెలిపారు.అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ 7989193131 నంబర్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు.వాతావరణం మెరుగుపడే వరకు ప్రజలు అనవసరంగా బయటకు రావొద్దని,వర్షపు నీరు చేరిన ప్రాంతాల్లో రాకపోకలు నివారించాలని కలెక్టర్ సత్యప్రసాద్ కోరారు.

**నీటమునిగిన లోలెవల్ వంతెనలు..**

జగిత్యాల జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలోని పలు గ్రామాల్లో గలలో లెవల్ వంతెనలు నీటి మునిగి రాకపోక లకు ఇబ్బందులు కల్గుతున్నాయి.జిల్లాలోని అనంతారం లోలెవల్ బ్రిడ్జి, నేరెళ్ల లో లెవల్ బ్రిడ్జి,ఫకీర్ కొండాపూర్ - యామపూర్‌లో లెవల్ బ్రిడ్జిల వద్ద వరద నీరు భారీగా ప్రవహిస్తుండటంతో అధికారులు రాకపోకలను నిలిపి వేశారు.

**వర్షాలతో అన్నదాతల్లో ఆనందం....**

రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.ఎల్ నినో ప్రభావంతో వర్షాలు కురవకపోవడం దిగులుగా అన్నదాతల్లో ఈ వర్షాలు కొత్త ఉత్సాహన్ని ఇచ్చాయి.రైతులు వర్షాన్ని లెక్క చేయకుండా వ్యవసాయ పనుల్లో బిజిబిజి అయ్యారు.

# మున్సిపల్ కార్మికుడు భీమయ్య మృతి



**చురకలు విలేకరి,రాయికల్, జూలై 30 :** మున్సిపల్ కార్మికుడు ప్లంబర్ భీమయ్య అనారోగ్యముతో గురువారం మృతిచెశీదగా మున్సిపల్ చైర్మన్, పాలకవర్గం పార్థీవ దేహానికి నివాళులు అర్పించారు.అంత్యక్రియల నిమిత్తం 10వేలు ఆర్థిక సాయాన్ని అందించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా పట్టణ ప్రజలకు త్రాగునీటి సరఫరాలో, లీకేజీ పైప్ లైన్ ల మరమ్మత్తులలో ఆయన సేవలు పట్టణ ప్రజలు మరువలేనిమన్నారు.ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ మనోహర్,కౌన్సిలర్లు గంగాధర్,రాకేష్ నాయక్,పుర్రె శ్రీధర్, నాయకులు తురగ శ్రీధర్, కూనరాపు భూమేష్,మచ్చ శేఖర్, బత్తిని నాగరాజు, రాము,ఎలిగేటి అనిల్ తదితరులున్నారు.

# అభివృద్ధి పనుల నిర్వహణలో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం

**-మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్**



**చురకలు విలేకరి, రాయికల్ జూలై30 :** రాయికల్ పట్టణ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు టెండర్లు వేసిన కాంట్రాక్టర్లు పనులు చేయడంలో నిర్లక్ష్యంచేస్తున్న కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేస్తామని మున్సిపల్ చైర్మన్ కట్కం రవీంధర్ అన్నారు.గురువారం రాయికల్ మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశము చైర్మన్ అధ్యక్షన జరిగింది. సమావేశంలో (11) అంశాలకు గాను (10) అంశాలు ఏకగ్రీవంగా తీర్మానించనైనది.టేబుల్ ఎజెండాగా (3) అంశాలను ప్రతిపాదించగా హాజరైన సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించి తీర్మానించారు.వర్షాకాలం ప్రారంభమైనందున వర్షాల వల్ల ఎదురయ్యే సమస్యల గురించి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు బ్లీచింగ్ పౌడర్ చల్లుట,వార్డులలో ఫాగింగ్ చేయుట,అంటీ లార్వా స్ప్రే చేయునట్టు తెలిపారు.వర్షపు నీరు నిల్వ ఉండకుండా మోటార్ల ద్వారా తొలగించుట,అవసరమైన చోట జె.సి.బి.తో తొలగించుట వంటి వాటి గురించి కౌన్సిల్‌సభ్యులు చర్చించినారు. పట్టణములో వర్షాలు ఎక్కువగా కురుస్తున్నందున శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉన్న వారు అప్రమత్తంగా ఉండాలని ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని కోరారు. మున్సిపాలిటి తరపున అన్ని రక్షణ చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.పట్టణములో తైబజార్ పెట్టకపోవడం వలన మున్సిపల్ ఆదాయానికి నష్టం వాటిల్లుతుందని కౌన్సిల్ సభ్యులు చర్చించినారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్,కౌన్సిలర్‌లు తోపారపు ప్రశాంతి,భుక్యా రాకేష్ నాయక్,వేముల మౌనిక,పల్లికొండ గంగాధర్,పుర్రె శ్రీధర్,కల్లెడ చిన్న ధర్మపురి,కో ఆప్షన్ సభ్యులు వల్లకొండ మహేష్,సుదవేని లత,ఇర్ఫాన్ అలీ,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో

# లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన బీజేపీ నాయకులు



**చురకలు ప్రతినిధి కోరుట్ల, జూలై 30 :** గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కోరుట్ల పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన 10, 11 వార్డులు, ముత్యాలవాడ, ఆదర్శనగర్ ప్రాంతాలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. అనూప్ రావు పట్టణ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆరోగ్యశాఖ, విద్యుత్ శాఖ, ఆర్అండ్‌బీ శాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని కోరారు.అత్యవసర పరిస్థితులు మినహా ప్రజలు బయటకు వెళ్లవద్దని, వరద నీరు ప్రవహిస్తున్న రహదారులు, వాగులు, చెరువులు దాటేందుకు ప్రయత్నించవద్దని సూచించారు. అలాగే విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగలు, నీటితో నిండిన ప్రాంతాలకు దూరంగా ఉండి అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మహేష్, పట్టణ ప్రధాన కార్యదర్శులు సాగర్, గణేష్, నవీన్, కార్యదర్శి ప్రేమ్ సాగర్, బీజేవైఎం అధ్యక్షుడు సంతోష్, ఐటీ సెల్ ఇన్‌చార్జి రాగంశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# ప్రణాళికాబద్ధంగా రాజన్న ఆలయ విస్తరణ పనులు

**-ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**




చురకలు ప్రతినిధి సిరిసిల్ల జూలై 30 : దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానాన్ని భక్తులకు మరింత సౌకర్యవంతమైన ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు.రాజన్న ఆలయంలో నిర్వహిస్తున్న మూడు రోజుల వరుణ యాగ ప్రారంభోత్సవం లో రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు తదితర ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు శీఘ్ర దర్శనం, మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ఆలయ అభివృద్ధి,విస్తరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం 2023-24లో రూ.50 కోట్లు, 2024-25లో రూ.100 కోట్లు కేటాయించగా, అనంతరం మరో రూ.99.40 కోట్లు మంజూరు చేయడంతో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని వెల్లడించారు.ప్రస్తుతం ఆలయ అభివృద్ధి పనుల్లో సుమారు 45 శాతం పూర్తయ్యాయని, మరో 10 నుంచి 12 నెలల్లో పూర్తి స్థాయిలో పనులు ముగించి, రాబోయే వెయ్యేళ్ల అవసరాలకు అనుగుణంగా రాజన్న ఆలయాన్ని తీర్చిదిద్దుతామని తెలిపారు. భక్తుల సూచనలు,సలహాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.12 కోట్లతో వేములవాడ గుడి చెరువు బండ్ పార్క్ లో ఆధునిక పార్కు, భారీ శివుడి విగ్రహం, మొక్కలు, నటరాజ విగ్రహం పనులు పూర్తి చేసి ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే రూ.10 కోట్లతో బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధి పనులు, రూ.47 కోట్లతో వేములవాడలో 80 అడుగుల రహదారి విస్తరణ పనులు కూడా కొనసాగుతున్నాయని చెప్పారు. భక్తులకు అన్నదాన సేవలను మరింత విస్తరించేందుకు రూ.35 కోట్లతో అన్నదాన సత్రం నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసిందని తెలిపారు.ఈ సందర్భంగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, వేములవాడ డిపోకు20కొత్త బస్సులు కేటాయించడం , అలాగే రూ.1.60 కోట్లతో తిప్పాపూర్ బస్టాండ్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేయడం ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

## గంగాధర పోలీసు స్టేషన్ వార్షిక తనిఖీ చేసిన

# కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం



చురకలు క్రైమ్ ప్రతినిధి, కరీంనగర్,జూలై 30 : కరీంనగర్ కమీషనరేట్ పరిధిలోని గంగాధర పోలీసు స్టేషన్ ను గురువారంనాడు కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం వార్షిక తనిఖీ చేశారు.పోలీస్ స్టేషన్ కు విచ్చేసిన కమీషనర్ కు స్టేషన్ ఎస్సై వంశీకృష్ణ పూల మొక్కను అందించి స్వాగతం పలికారు. అనంతరం సాయుధ దళ పోలీసుల గార్డ్ అందించిన గౌరవ వందనం స్వీకరించారు.పోలీస్ స్టేషన్ పరిసరాల ను పరిశీలించారు.అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో పలు కేసుల్లో పట్టుబడి స్వాధీనంలో ఉన్న వాహనాల వివరాలు అడిగారు. పోలీస్ స్టేషన్ లో హాజరులో ఉన్న సిబ్బందితో మాట్లాడి, వారికి కేటాయించబడిన విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. సరైన పద్ధతిలో రికార్డుల నిర్వహణ, నమోదైన కేసుల వివరాలు సీసీటీఎన్ఎస్ లో పొందుపరచాలని సూచించారు. తెలంగాణ పోలీసులు టెక్నాలజీ వినియోగంలో భాగంగా ఉపయోగించే సీసీటీఎన్ఎస్ - 2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో ఈ-సమన్ల జారీ మరియు అమలు, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, టెక్ దాటం, ఐరాడ్, దర్పన్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్‌లో ఆర్థిక మరియు ఆర్థికేతర నేరాల సమాచారం, సీడీఆర్ వంటి అన్ని రకాల సాఫ్ట్‌వేర్/ అప్లికేషన్‌లపై పూర్తి స్థాయిలో పట్టు సాధించి, వాటిని రోజువారీ విధుల్లో విరివిగా వినియోగించాలన్నారు .పోలీస్ స్టేషన్ కి కేటాయించబడిన పరికరాలను ,అలాగే పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్ ను బ్లూ కోల్ట్స్ సిబ్బంది వినియోగించే తీరును పరిశీలించారు. ఎఫ్ ఐ ఆర్ ఇండెక్స్ ని పరిశీలించి, పెండింగ్ కేసులపై సమీక్ష జరిపారు. కేసుల ఆలస్యానికి గల కారణాలు తెలుసుకుని, త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. నమోదైన సైబర్ నేరాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.గంగాధర పోలీసు స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలను సెక్టార్లుగా, సబ్ సెక్టార్లుగా విభజించి వాటికి గ్రామ పోలీసు అధికారులను కేటాయించాలని స్పష్టం చేశారు.రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రతి నెల వారికి సంబంధించిన నూతన సమాచారాన్ని సేకరించి రికార్డుల్లో నమోదు చేసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయకుమార్, చొప్పదండి సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్, గంగాధర ఎస్సై వంశీకృష్ణతో పాటు ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## గతంలో బుంగపడిన చెరువుకు

# శాశ్వత మరమ్మతులు చేయడంలో నిర్లక్ష్యం ఎవరిది?



చురకలు, విలేఖరి, వెల్గటూర్, జూలై 30 : జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం స్థంభంపల్లి గ్రామ పెద్దచెరువుకట్టకు గత వర్షా కాలంలో వరదఉధృతికి బుంగపడి వెంకటాపూర్ మీదుగా లొత్తునూర్ వెళ్లే రహదారి కొట్టుకు పోయిన సంఘటన తెల్సిందే అయితే అట్టి సమయంలో చెరువుకు పడిన బుంగకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి వదిలేసిన అధికారులు తిరిగి వర్షాకాలం వచ్చే సంవత్సరకాలం వరకు శాశ్వత మరమ్మతులు చేపట్ట కుండా ఎందుకు నిర్లక్ష్యం చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల మూలంగా స్థంభంపల్లి చెరువులోకి భారీగా వరదచేరడంతో తిరిగి ప్రమాదం అంచుల్లోకి వెళ్లిన పరిస్థితి ఎదురైంది. సంవత్సరకాలంపాటు దీనికి మరమ్మతులు చేపట్టకుండ అధికారుల నిర్లక్ష్యం వైఖరి మూలం గా ప్రస్తుతం కురిసే వర్షాల వల్ల వరద తాకిడి ఎక్కువై చెరువు కట్ట తెగితే ఎవరు బాధ్యత వహిస్తారు. గత మూడురోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో స్థంభంపల్లి చెరువుకు భారీ వరద చేరుతుంది. ఎక్కడ చెరువు కట్టకు గండి పడు తుందోనని లోతట్టు ప్రాంతాల ప్రజలు భయాందోళన చెందు తున్నారు.గురువారం ఇరిగేషన్, రెవిన్యూ, పోలీస్ అధికారులు స్థంభంపల్లి చెరువును పరిశీలించి, ఎప్పుడు ఎలాంటి పరిస్థితి ఎదురౌతుందోనని ఓ జేసీబీ ని అందుబాటులో ఉంచి ఒకవేళ ప్రమాదం జరిగే పరిస్థితి ఉంటే చెరువుకు గండి పెట్టే ఆలోచనతో నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారు. ఏది ఏమైనా గత సంవత్సరం బుంగ పడి ప్రమాదానికి గురైన చెరువుకు శాశ్వత మరమ్మతులు చేపడితే ప్రస్తుతం ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదని రాబోయే రోజుల్లో శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# కడెం ప్రాజెక్టును పరిశీలించిన ఎస్పీ



చురకలు ప్రతినిధి,నిర్మల్, జూలై 30 : జిల్లాలో మొన్న రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా ఎస్పీ.జానకి షర్మిల గురువారం కడెం ప్రాజెక్టును సందర్శించి వరద పరిస్థితులను పరిశీలించారు.ప్రాజెక్టు నీటి మట్టం, ప్రవాహ పరిస్థితులు,లోతట్టు ప్రాంతాల పరిస్థితి,ప్రజల రాకపోకలు, భద్రతా ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,రాబోయే రెండు రోజుల పాటు కూడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు జిల్లా పోలీసు శాఖ అన్ని విధాలుగా సిద్ధంగా ఉందని తెలిపారు.అలాగే కడెం ప్రాజెక్టు,ఇతర వాగులు,వంకలు, చెరువులు,నీటి ప్రవాహ ప్రాంతాల వద్దకు ఎవరూ వెళ్లరాదని, సెల్ఫీలు లేదా వీడియోలు తీసేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరించారు. గొర్రెలు,పశువుల కాపరులు, మత్స్యకారులు నీటి ప్రవాహ ప్రాంతాలకు వెళ్లకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, కాలువలను దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని స్పష్టం చేశారు. గ్రామాలు, పట్టణాల్లో పాత ఇళ్లు, గుడిసెలు, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో నివసిస్తున్న వారు మరింత అప్రమత్తం గా ఉండాలని సూచించారు. పరిస్థితుల ను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ల సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఆపత్కాల పరిస్థితులు ఏర్పడినా వెంటనే స్పందించి ప్రాణనష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ పీడీ విజయలక్ష్మి, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్,కడెం మండల తహసీల్దార్,ఎంపీడీవో,విద్యుత్ శాఖ ఏఈ,కడెం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రవీణ్ కుమార్,నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్,ఖానాపూర్ సీఐ సత్యనారాయణ, సంబంధిత శాఖల అధికారులు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రైల్వే ప్రాజెక్టు వేగవంతానికి

# కేంద్రానికి వినతి



చురకలు ప్రతినిధి,నిర్మల్, జూలై, 30 : ఆదిలాబాద్-నిర్మల్-ఆర్మూర్ రైల్వే మార్గాన్ని త్వరితగతిన మంజూరు చేసి, నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరుతూ తెలంగాణ బీజేపీఎంపీలు,ఎమ్మెల్యేలతో కలిసి ఢిల్లీలో కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌ని బీజే ఎల్పీ నేత,నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి.మహేశ్వర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ రైల్వే మార్గం ఉత్తర తెలంగాణ అభివృద్ధికి కీలకమని ,ప్రజల రవాణా సౌకర్యాలతో పాటు వ్యాపార,ఉపాధి అవకాశాలు కూడా విస్తరిస్తాయని వివరించారు.